## అధ్యాయము 8

# తెగుళ్లు: కప్పలు, పేలు, మరియు ఈగలు

8వ అధ్యాయము రెండవ తెగులు (కప్పలు)ను, మూడవ తెగులు (పేలు)ను, మరియు నాలుగవ తెగులు (ఈగలు)ను గూర్చి నమోదు చేస్తుంది. రెండవ తెగులుకు సంబంధించి, ఇశ్రాయేలు యొక్క విడుదలను గూర్చి అడుగుటకు మరియు ఒకవేళ తమ విన్నపమును మన్నించని యెడల రాబోయే తెగులును గూర్చి ప్రకటించుటకుగాను మోషే మరియు అహరోనులు ఫరో ముందు ప్రత్యక్షమయ్యారు (8:1, 2). దేవుని యొక్క శక్తి వలన, మోషే మరియు అహరోనులు కప్పలను రప్పించగలిగారు; కాని, ఐగుప్తీయులలోని మంత్రగాళ్లు కూడా ఇదే కార్యాన్ని అనుకరించగలిగారు (8:3-7). ఫరో కఠినపరచుకొని మోషే మరియు అహరోనుల కొరకు పిలువనంపాడు. ఈ తెగులును ఒకవేళ పోగొట్టినయెడల, తమ ప్రజలను విడిచిపెడతానని అన్నాడు. ఫలితంగా, తెగులు వెనుకకు తీసుకొనబడింది (8:8-14), కాని ఫరో తన హృదయమును కఠినపరచుకొని ప్రజలు వెళ్లుటకు అనుమతించలేదు (8:15).

దేవుని యొక్క వాక్యము ప్రకారముగా, మోషే మరియు అహరోనులు అప్పుడు పేలును సృష్టించారు మరియు అవి ఆ దేశమందంతట వ్యాపించినవి. ఈ సూచన "దైవశక్తి" వలన కలిగిన కార్యమని ఐగుప్తీ శకునగాండ్రు ఒప్పుకున్నారు. కాని, ఫరో కదలక ఉంది ఇశ్రాయేలు ఐగుప్తు దేశమును విడచుటకు నిరాకరించినవాడాయెను (8:16-19).

తదుపరి తెగులు వచ్చుటకు మునుపు, మోషే ఫరోను ఎదుర్కొని ఒకవేళ ఇశ్రాయేలీయులను తాను వెళ్లనియ్యని యెడల ఈగల గుంపు ఐగుప్తు దేశము అంతటిని ఆవరించును అని హెచ్చరించాడు. ఐగుప్తు మరియు ఇశ్రాయేలు మధ్య దేవుడు విభేదమును పుట్టించును అని చెప్పాడు: ఇశ్రాయేలీయులు జీవించుచున్న ప్రాంతమైన గోషెను ఈ తెగులును అనుభవించదు అని చెప్పాడు. మోషే చెప్పినట్లుగానే దేవుడు తెగులును పంపాడు (8:20-24). మోషేతో బేరము కుదుర్చుకొనుటకు ప్రయత్నిస్తూ ఫరో స్పందించాడు, మొదట ఇశ్రాయేలీయులు ఆ దేశములోనే ఆరాధించాలని చెప్పాడు. తరువాత, కొంత దూరము మట్టుకు మాత్రమే వెళ్లి తమ ఉత్సవమును జరుపుకొనుటకు

వారికి అనుమతించాడు (8:25-29). ఈగల గుంపు విడిచిన తరువాత, ఫరో తన హృదయమును మరలా కఠినపరచుకున్నాడు గనుక ప్రజలను వెళ్లనీయలేదు (8:30-32).

## కప్పలు (8:1-15)

### కప్పలు ఐగుప్తు దేశమును కప్పుట (8:1-7)

**[1]యెహోవాఏటిని కొట్టి యేడు దినములైన తరువాత యెహోవా మోషేతో ఇట్లనెను - నీవు ఫరో యొద్దకు వెళ్లి అతనితో నన్ను సేవించుటకు నా జనులను పోనిమ్ము; [2]నీవు వారిని పోనియ్యనొల్లనియెడల ఇదిగో నేను నీ పొలిమేరలన్నిటిని కప్పలచేత బాధించెదను. [3]ఏటిలో కప్పలు విస్తారముగా పుట్టును; అవి నీ యింట నీ పడకగదిలోనికి నీ మంచముమీదికి నీ సేవకుల యిండ్లలోనికి నీ జనులమీదికి నీ పొయిలలోనికి నీ పిండి పిసుకు తొట్లలోనికి ఎక్కి వచ్చును; [4]ఆ కప్పలు నీ మీదికి నీ జనుల మీదికి నీ సేవకులందరిమీదికి వచ్చునని యెహోవా సెలవిచ్చుచున్నాడని చెప్పుమనెను. [5]మరియు యెహోవా మోషేతో ఇట్లనెను - నీవు అహరోనును చూచి - నీకఱ్ఱ పట్టుకొనియేటిపాయల మీదను కాలువల మీదను చెరువుల మీదను నీ చెయ్యి చాపి ఐగుప్తు దేశముమీదికి కప్పలను రాజేయుమని అతనితో చెప్పుమనగా [6]అహరోను ఐగుప్తు జలములమీద తన చెయ్యి చాపెను; అప్పుడు కప్పలు ఎక్కివచ్చి ఐగుప్తు దేశమును కప్పెను. [7]శకునగాండ్రుకూడా తమ మంత్రములవలన అలాగు చేసి ఐగుప్తు దేశము మీదికి కప్పలను రాజేసిరి.**

**వచనములు 1, 2.** రెండవ తెగులును గూర్చిన ఈ నివేదిక మోషే **ఫరోతో** ఏమి చెప్పాలో అనే విషయాన్ని చెప్తుంది కాని అసలూ మోషే ఐగుప్తీ రాజుతో నడిపిన సంప్రదింపులను గూర్చి ఖచ్చితముగా నమోదుచేయుట లేదు. ఈ రెండవ తెగులు ఒక విన్నపమును పీఠికగా కలిగియుండాలని యెహోవా చెప్పాడు - **నా జనులను పోనిమ్ము** - మరియు ఒక హాని/ఉపద్రవము - **నీవు వారిని పోనియ్యనొల్లనియెడల ఇదిగో నేను నీ పొలిమేరలన్నిటిని కప్పలచేత బాధించెదను.** "బాధించెదను" అను క్రియారూపమునకు ప్రయోగింపబడిన పదము (נָגַף, *nagap*) కొన్నిసార్లు బలమైన గాయమును కలుగజేయు లేదా ఆపదను కలిగించు ఒక దెబ్బను సూచించేదిగా ఉంది. ఒక యుద్ధములో ఒక సైన్యము తుత్తునీయులుగా ఓడిపోతే కూడా ఈ పదము ప్రయోగింపబడవచ్చు. ప్రాచీన ఐగుప్తులో, "కప్పలు" అనునవి Heket (లేదా Heqet) అనే దేవతకు, అంటే బిడ్డలను ప్రసవించునప్పుడు స్త్రీలకు సహాయపడే దేవతకు, సూచనగా ప్రయోగించేవారు. ఈ దేవత ప్రతిమలను కలిగియున్న కొన్ని తాయిత్తులను స్త్రీలు ప్రసవ సమయములో ధరించేవారు. సహాయమునకు సూచనగా ఉండుటకు బదులు, ఈ కప్పు అనునది ఐగుప్తీ సమాజమునకు ఇప్పుడు ఒక భయంకరమైన ఉపద్రవముగా మారబోతుంది.

**వచనములు 3, 4.** ఈ తెగుళ్ల యొక్క ప్రభావము చాలా విపులంగా వివరించబడింది. ఈ**కప్పలు** ఫరో యొక్క **ఇంటిలో** మరియు **పడకగదిలో**, తన **మంచముపై**, అలాగే [తన] **సేవకుల** ("అధికారులు"; NIV) యిండ్లలో అలాగే మిగిలిన **తన జనుల**, అనగా ఐగుప్తీయుల యిండ్లలో కూడా ఉంటాయి. అవి తన **పొయ్యిలను** మరియు **తన పిండి పిసుకు తొట్లను** కూడా దేశమంతటా కలుషితం చేయును. ఈ విధంగా వ్యక్తిగత స్థలములను ప్రస్తావించుట ద్వారా, అవి ఉన్నప్పుడు కలిగే దుర్వాసన భరితమైన తమ ఉనికిని ఎవరు కూడా తప్పించుకోలేరు అనే విషయాన్ని రచయిత ఉద్ఘాటిస్తున్నాడు.

పురాతన కాలపు "పొయ్యిలు" ఎక్కువగా రొట్టెలను కాల్చుకొనుటకు ప్రయోగించేవారు. అవిమట్టితో చేయబడినవై ఒక గుండ్రముగా లేదా గ్రుడ్డు ఆకారములో చేయబడేవి. ఈ పొయ్యిలను నేలపైన లేదా పైన కాని, లోపల కాని బయట కాని కూడా పెట్టవచ్చు.[1] "పిండి పిసుకు తొట్టెలు" లేదా "పిండి పిసుకు గుంతలు" (NIV) రొట్టెలను చేయు నిమిత్తము నీటిని మరియు పిండిని కలిపి పిసుకుటకు వాడబడేవి. వంటలకు ఉపయోగించే ఈ పాత్రలు పెద్దవిగా ఉండేవి, ఈ విషయం ఒక ప్రాచీన ఫెనికయ స్త్రీ తన పిండిని పిసుకుతూ తీయబడిన ఒక మట్టి బొమ్మ (క్రీ.పూ. తొమ్మిది నుండి ఆరవ శతాబ్దమునకు చెందిన) ఆధారంగా తెలుస్తుంది.[2] ఏది ఏమైనా, ఇశ్రాయేలీయులచే ఉపయోగించబడే తొట్టెలు "బట్టతో చుట్టబడి భుజములపై మోసుకొనేంత తేలికగా ఉండేవి కనుక చిన్నవిగాను, తేలికైన చెక్క పెట్టెలుగాను ఉండేవి" (నిర్గమ. 12:34)."[3]

**వచనములు 5-7.** మోషే చేసిన మనవులకు ఫరో యొక్క స్పందనను గూర్చి ఏమియు చెప్పబడలేదు గనుక, రాజు మరలా ఇశ్రాయేలు యొక్క విన్నపాన్ని తిరస్కరించాడని చదువరి అనుకోవాలి. దేవుడు అహరోనుతో [తన] **చేతిని చాచమని** చెప్పాడు (7:19 చూడండి), మరియు ఫలితముగా **కప్పలు బయలుదేరి ఐగుప్తు దేశము అంతటా కప్పినవి.** కాగా, **శకునగాండ్రు** కూడా, బహుశా కొంత శకున తంత్రముతో, అహరోను ద్వారా దేవుడు జరిగించిన ఆ సూచకక్రియను కొంతవరకు అనుకరించగలిగారు.

## కప్పలు చచ్చిపోవుట (8:8-15)

**8అప్పుడు ఫరో మోషే అహరోనులను పిలిపించి - నా యొద్దనుండి నా జనులయొద్ద నుండి ఈ కప్పలను తొలగించుమని యెహోవాను వేడుకొనుడి, అప్పుడు యెహోవాకు బలి అర్పించుటకు ఈ ప్రజలను అగత్యముగా పోనిచ్చెదననెను. 9అందుకు మోషే - నన్ను గెలిచినట్టుగా నీవు అతిశయింపవచ్చును, ఈ కప్పల శేషము ఏటిలోనే ఉండునట్లును అవి నీ మీదను నీ యిండ్లలోను ఉండకుండ చంపబడునట్లును నీ కొరకును నీ సేవకుల కొరకును నీ ప్రజల కొరకును నేనెప్పుడు వేడుకొనవలెనో చెప్పుమని ఫరోను అడుగగా అతడు రేపే అనెను. 10అందుకతడు - మా దేవుడైన యెహోవా వంటి వారెవరును లేరు అని నీవు తెలిసికొనునట్లు నీ మాట చొప్పున జరుగును; 11అనగా కప్పలు నీ యొద్దనుండియు నీ యిండ్లలో నుండియు నీ సేవకుల యొద్దనుండియు నీ ప్రజలయొద్ద**

**నుండియు తొలగిపోవును; అవి యేటిలోనే ఉండుననెను. [12]మోషే అహరోనులు ఫరో యొద్దనుండి బయలు వెళ్లినప్పుడు యెహోవా ఫరో మీదికి రాజేసిన కప్పల విషయములో మోషే అతనికొరకు మొఱపెట్టగా [13]యెహోవా మోషే మాటచొప్పున చేసెను గనుక ఇండ్లలో నేమి వెలుపల నేమి పొలములలోనేమి కప్పలు ఉండకుండ చచ్చిపోయెను. [14]జనులు వాటిని కుప్పలుగా చేసినప్పుడు భూమి కంపుకొట్టెను. [15]ఫరో ఉపశమనము కలుగుట చూచి యెహోవా సెలవిచ్చినట్టు తన హృదయమును కఠినపరచుకొని వారి మాట వినకపోయెను.**

**వచనము 8.** మోషే మరియు అహరోనుల వలె వారు కూడా సూచనలను చేయుటకు సమర్థులు అని శకునగాండ్రు ఫరోకు నిరూపించదలచినట్లయితే, ఆ కప్పలను మరి ఎక్కువగా పుట్టించుటకు శక్తి వారికి ఉన్నదని చెప్పి అనుకరించుటకంటే, ఆ కప్పలను అక్కడ నుండి తోలివేసి తమ సామర్థ్యాన్ని వెల్లడి చెసుకొనవలసింది. ఫరో ఈ విషయాన్ని చూచాడు, కనుక వారి రహస్యపు కళలపై మరియు తంత్రములపై ఆధారపడి, ఆ తెగులును ముగించునట్లు తన శకునగాండ్ర మీద ఆధారపడలేదు. కాబట్టి, ఆయన **మోషే మరియు అహరోను**లను పిలువనంపి తన ముందుకు ఆహ్వానించి **ఈ కప్పలను తొలగించుమని యెహోవాను వేడుకొనుడి** అని అన్నాడు. **యెహోవాకు బలి అర్పించుటకు ఈ ప్రజలను అగత్యముగా పోనిచ్చెదను** అని ఆయన ఒప్పుకున్నాడు. "యెహోవా ఎవడు . . . ?" అని ఫరో ప్రశ్నించినప్పటి నుండి ఆయన యొక్క వైఖరి మారింది (5:2); కాని ఈ కథనము తదుపరి భాగములో ఆయనలో వచ్చిన లొంగుబాటులోనికి ఆయన ఇంకా నడిపించబడలేదు (12:32).

**వచనములు 9, 10.** ఈ కప్పల వలన కలిగిన తెగులును ఎప్పుడు అంతమొందించాలి అనే విషయాన్ని **మోషే ఫరో**కే వదిలేశాడు. ఫరో సమయమును చెప్పినప్పుడు ("**రేపు**") అదే సరాసరి సమయమునకు తెగులు తీసివేయబడినప్పుడు, ఆ తెగులు ఇశ్రాయేలు యొక్క **దేవుడైన యెహోవా** వలననే పంపబడినది మరియు ఆయనే దానిని తొలగించాడు అనేదానిపై ఎటువంటి సందేహము ఉండదు. అప్పుడు ఆ రాజు దేవుని యొక్క విశిష్టమైన శక్తినిబట్టి ఒప్పింపబడి, **ఆయనను పోలినవారు ఎవరును లేరు అని గ్రహిస్తాడు.**

**వచనము 11. కప్పలు** తన నుండి, తన సేవకుల నుండి, మరియు ఐగుప్తీ ప్రజల నుండి తీసివేయబడతాయి అని మోషే ఫరోకు నిశ్చయతను ఇచ్చాడు; **అవి యేటిలోనే ఉండును** అని అన్నాడు. ఈ జీవులకు ఈ యేరు సహజమైన స్థావరముగా ఉండేది. నైలు నదిలో వార్షికంగా సంభవించే వరదల తరువాత కప్పలు ఎక్కువగా ఉండేవి; తగ్గుతున్న జలములు ఈ కప్పలు ఎక్కువగా వర్ధిల్లుటకు వీలైన వాతావరణమును కలిగించేవి.

**వచనములు 12-14. మోషేమరియు అహరోనులు ఫరో** నొద్ద నుండి వెళ్లిపోయిన తరువాత, ఆ కప్పలను తొలగించవలసినదిగా మోషే **యెహోవాను** వేడుకున్నాడు. మోషే యొక్క విజ్ఞాపనను **యెహోవా** విన్నాడు మరియు ఆయన **మోషే మాటచొప్పున చేసెను**,[4] ఈ సంగతి "నీతిమంతుని విజ్ఞాపన మనఃపూర్వకమైనదై బహు బలముగలదై

యుండును” అని యాకోబు చెప్పిన (యాకోబు 5:16) మాటను ఉదాహరిస్తుంది.

ఏదేమైనను, తెగులును తొలగించడం అనేది ఆ తెగులు వలెనె అంతటి హేయమైనది. “ఈ ఉపశమనం [רְוָחָה, *r^ewachah;* 8:15] ఈ గర్విష్ఠుడైన రాజులు తెగులు కంటే మిక్కిలి నీచమైనది” అని Walter C. Kaiser, Jr., అంటాడు.[5] బాధించిన ఆ కప్పలు తిరిగి నదిలోనికి ఎగిరి వెళ్లలేదు. కాని, అవి ఉన్నచోటనే అవి చచ్చినాయి - **యిండ్లలో, వెలుపల, మరియు పొలములలో** అవి పడి ఉన్నాయి. శుభ్రపరచుటకు ప్రయత్నించుచుండగా, ఐగుప్తీయులు వాటిని **కుప్పలుగా పేశారు**. ఈ తెగులు సంభవించిన తరువాత చోటుచేసుకున్న పరిణామాలు చాలా నీచంగా ఉన్నాయి: **భూమి కంపుకొట్టెను**. కుళ్లుతున్న ఈ కప్పల వాసన వలన ఆ దేశమంతా దుర్వాసనతో నిండిపోయింది.[6] ఖచ్చితముగా ఇదే భాష 7:21లో కూడా చేపలు “చచ్చిపోయి, నదంతా కంపుకొట్టినప్పుడు” ప్రయోగించబడింది. ఐగుప్తీయులు దీనిని గ్రహించారో లేదో కాని, ఆ దుర్వాసనకు కారణము ఫరో దేవుని యొక్క నిర్దేశములు వినుటకు నిరాకరించడమే.

**వచనము 15.** ఏదేమైనను, ఫరో **ఉపశమనము కలుగుట చూచి**నప్పుడు, **తన హృదయమును కఠినపరచుకున్నాడు** (וְהַכְבֵּד אֶת־לִבּוֹ, *w^ehakbed ’eth libbo*). ఫరో యొక్క హృదయ కాఠిన్యమును గూర్చి మాట్లాడు సందర్భములలో మూడు వివిధమైన హెబ్రీ క్రియారూపములు, మూడు విధములైన అర్థములతో ప్రయోగించబడ్డాయి. తరచుగా ప్రయోగించబడిన ఒక పదము, ఇక్కడ 15వ వచనములో కూడా వాడబడినది, כָּבֵד (*kabed*) అను పదము, దీని అర్థము “భారముగా ఉండుట.” తరచుగా వచ్చే మరొక క్రియా రూపము ఏదనగా חָזַק (*chazaq*), దీని అర్థము “బలముగా పెరుగుట.” 7:3 మరియు 13:15లో, వాస్తవంగా ప్రయోగించబడిన పదము קָשָׁה (*qashah*), దీని అర్థము “కఠినంగా చేయు.” ఫరో యొక్క మూర్ఖత్వము మరలా తేటతెల్లమవుతుంది. మోషే మరియు అహరోనులు సూచకక్రియలను చేయడం ఆయన చూసాడు, రెండు తెగుళ్ల వలన ఐగుప్తు ఇప్పటికే బాధింపబడుట చూచాడు, ఆ తెగుళ్ల వలన తన ప్రజలు బాధపడడమూ చూసాడు. అయినప్పటికీ, ఉపశమనము కలిగినప్పుడు, మోషేతో ఆయన చేసిన ప్రతిజ్ఞను మరచి దేవుని ప్రజలు వెళ్లుటకు నిరాకరించాడు. దేవుడు చెప్పినట్లుగానే ఫరో **వినికిడి** వైఫల్యం జరిగింది, మరియు దేవుడు మహిమపరచబడులాగున ఈ సందర్భములన్నియు ఇంకా క్రియ చేస్తూనే ఉంటాయి.

## పేలు (8:16-19)

**16అందుకు యెహోవా మోషేతో నీవు నీ కఱ్ఱ చాపి యీ దేశపు ధూళిని కొట్టుము. అది
ఐగుప్తు దేశమందంతటను పేలగునని అహరోనుతో చెప్పుమనగా వారు అట్లు చేసిరి.
17అహరోను తనకఱ్ఱను పట్టుకొని చెయ్యి చాపి ఆ దేశపు ధూళిని కొట్టినప్పుడు పేలు
మనుష్యులమీదను జంతువులమీదను ఉండెను; ఐగుప్తు దేశమందంతటను ఆ దేశపు
ధూళి అంతయు పేలాయెను. 18శకునగాండ్రు కూడా పేలను పుట్టించవలెనని తమ
మంత్రములచేత అట్లు చేసిరి గాని అది వారివలన కాకపోయెను. పేలు
మనుష్యులమీదను జంతువులమీదను ఉండగా 19శకునగాండ్రు - ఇది దైవశక్తి అని**

**ఫరోతో చెప్పిరి. అయితే యెహోవా చెప్పినట్టు ఫరో హృదయము కఠినమాయెను, అతడు వారిమాట వినకపోయెను.**

**వచనములు 16, 17.** ఫరో తన హృదయమును కఠినపరచుకొనుట ఫలితంగా, దేవుడు మూడవ తెగులును పంపాడు, **పేలు** వలన కలిగే తెగులు, ఇది **మనుష్యులను మరియు జంతువులను** కూడా బాధించింది. NASB అనువాదములో పేలుగా అనువదించబడిన పదము హెబ్రీ పదమైన כֵּן (*ken*) నుండి గ్రహించబడింది. ఈ పదము ద్వారా ఏ కీటకము సూచించబడుతుంది అనేది చెప్పడం కష్టం ఎందుకంటే ఈ పదము పాతనిబంధనలో చాలా అరుదుగా వాడబడింది.[7] NASB కాకుండా ఇతర అనువాదములు కూడా "పేలు" అని అనువదిస్తున్నాయి గనుక (NRSV; NIV; ESV; NAB), ఇతర అనువాదములు *ken* అను పదమును "పురుగు" (KJV; NKJV)గా, "క్రిమి" (REB)గా, మరియు "దోమలు" (NJB)గా అనువదిస్తున్నాయి.

ఈ తెగులో ఉన్న "పేల"ను ఫిలో అనే ఒక తత్త్వశాస్త్రజ్ఞుడు వివరిస్తూ ఇవి నాసికారంధ్రములలోను మరియు ముక్కులలోను దూరుతూ, అలాగే కళ్లలోనికి ఎగురుతూ కనుపాపలను గాయపరచేవి అని అంటాడు.[8] R. Alan Cole ప్రకారం *ken* అనే పదము బహుశా దోమలను సూచించి ఉంటుంది అంటాడు: "దోమలు నమ్మశక్యముకాని సంఖ్యల్లో పెరిగేవి; వాటిని కదిపినప్పుడు ఒక నల్లని మేఘమువలె పైకి ఎగిరేవి, మరియు గాలి అంతయు వాటి కీచుమనే ధ్వనితో నిండిపోయేది."[9] ఈ తెగులులో వచ్చినవి ఏవైనప్పటికీ కూడా, ఈ కీటకములు లెక్కించలేనివియు మరియు **ఐగుప్తు దేశమందంతట** వ్యాపించినవిగా ఉన్నాయి. "అంతట" అంటే ఈ క్రిములు ఐగుప్తు ప్రదేశాలలో ప్రతి చదరపు అడుగు విస్తరించి ఉన్నాయని మాత్రం కాదు; కాని, ఈ పేలు (లేదా దోమలు) దేశమంతట విస్తరించి ఉన్నాయనే అర్థాన్ని ఈ పదం తెలియజేస్తుంది.

**వచనములు 18, 19. శకునగాండ్రు** ఈ సమయము వరకు కూడా మోషే చేసిన సూచన క్రియలను జరిగించుటలో సమతూగారు. కాని, ఈ **పేలను** సృష్టించుటలో మాత్రం అనుకరించలేకపోయారు. కాబట్టి, మోషే శకునగాడు మాత్రం కాదు అంతకంటే ఎక్కువ మరియు ఆయన చేస్తున్నది ఒక శకునము కంటే ఎక్కువైనది అని ఆ శకునగాండ్రు ఫరోతో చెప్పారు. మోషే చేస్తున్న సూచనలు వాస్తవమైనవి.

ఈ తెగులు తరువాత ఫరో పిలిచిన సమావేశమును ఈ నేపథ్యము సూచిస్తుంది, ఈ సమావేశములోనే ఫరో తన సలహాదారులతో మాట్లాడుతూ మోషే అడుగుతున్న వాటిని వారికి ఇవ్వాలా వద్దా అని సలహా అడిగాడు. ఈ సమావేశమునకు శకునగాండ్రు కూడా ఆహ్వానించబడ్డారు, మరియు వారు **ఫరోతో ఇది దైవశక్తి** అని చెప్పారు. వేరొక మాటలలో చెప్పాలంటే, "ఇది వాస్తవికమైన విషయము; ఇది కేవలం ఒక శకునము మాత్రమేకాదు" అని వారు అన్నారు. ఫరో మోషే మరియు అహరోనులు చెప్తున్న మాటలను వినాలి, ఎందుకంటే వారు నిజముగా సూచక క్రియలను చేస్తున్న దేవుని వద్ద నుండి వచ్చినవారు అని ఈ మాటల భావమైయున్నది.

"దైవశక్తి" అనే భావము దేవుని బలమైన "హస్తము" మరియు "చేయి"లను గూర్చి చెప్పిన భావములను పోలినదిగా ఉంది (3:19పై గల వ్యాఖ్యలను చూడండి). దేవుడు

ఆత్మసంబంధమైన వాడైనప్పటికీ, ప్రజలు ఆయనను మరింత ఎక్కువగా అర్థము చేసుకొనులాగున ఆయన మానవ భాషలో వివరించబడ్డాడు. దేవుని వ్రేళ్ల యొక్క శక్తి సృష్టిలో (కీర్త. 8:3), రాతి పలకలపై పది ఆజ్ఞలను వ్రాసినప్పుడు (నిర్గమ. 31:18; ద్వితీయ. 9:10), మరియు యేసు దయ్యములను వెళ్లగొట్టిన సందర్భములలో (లూకా 11:20) అన్వయించబడింది.

ఈ శకునగాండ్రు ఇచ్చిన సలహాను వినుటకు **ఫరో** నిరాకరించి మరొకసారి తన **హృదయమును కఠినపరచుకున్నాడు**, ఫలితముగా ఇశ్రాయేలు మరొకసారి తమ దాస్య దేశమును వీడి వెళ్లుటకు అనుమతించబడలేదు. మూడవ తెగులును తొలగించడాన్ని గూర్చి ఏమియు చెప్పబడలేదు. పేలు, లేదా దోమలు, అనేది కేవలం ఒక తాత్కాలిక సమస్యయై ఉంటుంది మరియు దానంతట అదే పరిష్కరించబడి ఉంటుంది. కొద్ది కాలము పాటు దేవుడు నైలు నదిని ఏవిధంగా రక్తముగా మార్చాడో, అలాగే తాత్కాలికంగా దేవుడు ఐగుప్తు దేశముపై పేల తెగులును రప్పించి ఉంటాడు.

## ఈగలు (8:20-32)

### దోమలు ఐగుప్తులో మూగినవి (8:20-24)

**[20]కాబట్టి యెహోవా మోషేతో - నీవు ప్రొద్దున లేచి ఫరో యెదుట నిలువుము, ఇదిగో అతడు ఏటియొద్దకు పోవును. నీవు అతని చూచి - నన్ను సేవించుటకు నా ప్రజలను పోనిమ్ము. [21]నీవు నా ప్రజలను పోనియ్యని యెడల చూడుము నేను నీ మీదికిని నీ సేవకుల మీదికిని నీ ప్రజలమీదికిని నీ యిండ్లలోనికి ఈగల గుంపులను పంపెదను; ఐగుప్తీయుల యిండ్లును వారున్న ప్రదేశమును ఈగల గుంపులతో నిండియుండును. [22]మరియు భూలోకములో నేనే యెహోవాను అని నీవు తెలిసికొనునట్లు, ఆ దినమున నేను నా ప్రజలు నివసించుచున్న గోషెను దేశమును వినాయించెదను, అక్కడ ఈగల గుంపు లుండవు. [23]నా ప్రజలను నీ ప్రజలనుండి ప్రత్యేకపరచెదను, రేపు ఈ సూచక క్రియ జరుగునని యెహోవా సెలవిచ్చినట్టు నీవు చెప్పవలెననెను. [24]యెహోవా ఆలాగు చేసెను. బాధకరమైన ఈగల గుంపులు ఫరో యింటిలోకిని అతని సేవకుల యిండ్లలోకిని వచ్చి ఐగుప్తు దేశమంతట వ్యాపించెను. ఆ దేశము ఈగల గుంపులవలన చెడిపోయెను.**

**వచనము 20.** ఫరో తన హృదయమును మార్చుకుని ఇశ్రాయేలు ప్రజలు వెళ్లుటకు నిరాకరించిన తరువాత, దేవుడు నాలుగవ తెగులును పంపాడు. క్రితము మొదటి తెగులు వచ్చుటకు మునుపు చేసినట్లుగానే (7:15) **ప్రొద్దున లేచి . . . అతడు ఏటియొద్దకు పోవునప్పుడు** రాజును ఎదుర్కొనుటకు వెళ్లవలసినదిగా దేవుడు **మోషేను** ఆజ్ఞాపించాడు. ఇదే విధంగా ఏడవ తెగులు వచ్చుటకు మునుపు కూడా "ప్రొద్దున లేచి" వెళ్లవలసినదిగా చెప్పబడ్డాడు (9:13). దేవుని నుండి మోషే తెచ్చిన సందేశము మునుపటి సందర్భముల వలెనే అదే సందేశం **నా జనులను పోనిమ్ము.**

**వచనము 21.** ఈ సందేశముతోనే కూడా కలిపి ఇవ్వబడింది ఒక తెగులు. ఫరో

ఒకవేళ వినుటకు నిరాకరించినట్లయితే, దేవుడు ఆయన మీదకును, ఆయన సేవకుల మీదకును మరియు ఐగుప్తు ప్రజలందరి మీదకును **ఈగల గుంపులను పంపిస్తాడు.** ఈ తెగులు ఏమిటి?మూల వాక్యము చదివితే "గుంపు" (בֹרָעֶה, *he'arob*) అని మాత్రమే ఉంది. NASB అనువాదము కాకుండా, ఇతర అనువాదములు కూడా "ఈగల గుంపు" అనే ఆలోచన కలిగియున్నాయి (KJV; NKJV; NRSV; NIV; ESV; REB; NAB). ఈ పదమును NJB అనే అనువాదము "బూసి"లు గా అనువదిస్తుంది. NASB అనువాదము యొక్క కొన్ని ప్రతులు "క్రిముల గుంపు" అను అనువదిస్తున్నాయి. ఈ పదమునకు అర్థము "మిశ్రమము" మరియు క్రిముల యొక్క మిశ్రమాన్ని, అంటే "అన్ని విధములైన ఎగిరే జీవుల యొక్క గుంపు"ను సూచించేదిగా ఉంది అని అంటూనే, ఒకవేళ ఒకే కీటకాన్ని గూర్చి మాట్లాడుతున్నట్లయితే, ఈ బాధిస్తున్న కీటకము చాలా బాధించేట్లు కోరికే "సేటికాలపు జోరీగ లేదా నల్లని గండీగ"ను[10] సూచించేదిగా Septuagint (హెబ్రీ బైబిల్ యొక్క గ్రీకు అనువాదం) అనువాదం ఉన్నదని Cole అనే రచయిత అభిప్రాయపడ్డాడు. కీర్తనకారుడు తరువాత వ్రాస్తూ, "ఆయన వారిమీదికి జోరీగలను గుంపుగా విడిచెను" అని అన్నాడు (కీర్తన 78:45). ప్రాచీన ఐగుప్తీయులకు, కొరుకుతున్న కీటకము పటుత్వముకును మరియు పట్టుదలకును సూచనగా ఉండేది. "Order of the Golden Fly" లేదా "Fly of Valor" అనే ఒక సైనిక అలంకరణను యుద్ధములో వీరత్వము కనుబరచిన సైనికులకు బహుమతిగా ఇచ్చేవారు.

**వచనములు 22, 23.** ఈ తెగులు ప్రతి ఒక్కరిని బాధిస్తుంది మరియు ఐగుప్తులోని ప్రతి ప్రదేశములో ఉంటుంది, కాని దేవుని ప్రజలు నివశిస్తున్న **గోషెను దేశమును** మాత్రం ప్రభావితం చేయదు (ఆది. 45:10; 47:27). ఈ తెగులు ఫరిదిలోనికి రాకుండా ఇశ్రాయేలీయులను మినహాయించుట ద్వారా, తన ప్రజలకును ఐగుప్తీ ప్రజలకును మధ్య వ్యత్యాసమును చూపుతున్నట్లుగా దేవుడు తెలియజేస్తున్నాడు. మిగతా తెగుళ్ల విషయములో కూడా స్పష్టముగా ఆయన ఇదే చేసాడు (9:4, 11, 26; 10:6, 23; 11:7). ఐగుప్తీయులను శిక్షిస్తూ, దేవుడు తన ప్రజలను కాపాడాడు. ఈ విధంగా చేయుట ద్వారా, ఆయన తన ప్రసన్నతను ఉద్ఘాటించాడు: **భూలోకములో నేనే యెహోవాను.**

ఈ తెగులు ఆరంభమగుటకు మోషే సమయమును కేటాయించవలసినవాడుగా ఉన్నాడు: **రేపు.** పిమ్మట, అది జరిగిన తరువాత, ఈ తెగులును యెహోవాయే ఐగుప్తు మీదికి తెచ్చాడని ఫరో మరియు అతని సేవకులు తెలుసుకుంటారు. "ఈగల గుంపు" యొక్క రాకను కేవలము ఒక యాదృచ్చిక చర్యగా చూడలేము.

**వచనము 24.** ఫరోతో ఏమి చెప్పాలో దేవుడు మోషేతో చెప్పిన విషయాన్ని రచయిత ఇక్కడ నమోదు చేసి తరువాత ఈ తెగులు యొక్క ఆగమనమునకు వచ్చేసాడు. మోషే ఫరోను కలవడం, దేవుని మాటను మోషే దేవునితో చెప్పడం మరియు ఫరో ఆ మాటను వినుటకు నిరాకరించడం ఈ విషయాలన్నిటిని రచయిత దాటి వెళ్లాడు. ఏమి జరిగి ఉంటుందా అనే విషయం చదువరికి ఇప్పటికే బాగా తెలిసి ఉంటుంది అని రచయిత భావించి ఉంటాడు.

ఈ తెగులు మొదటిగా **ఫరో యింటి**ని బాధించింది, తరువాత **తన సేవకుల యిండ్ల**ను ("అధికారుల"; NIV) బాధించింది. **ఆ దేశము ఈగల గుంపుల వలన చెడిపోయెను** అనే

సత్యము కొంత మంది వ్యాఖ్యాతలకు క్రొత్త ఆలోచన ఇచ్చింది, ఏమంటే ఈ కీటకముల "గుంపు" కేవలము బాధించేవి మాత్రమే కాదు కాని ఇవి దోమ్మరోగం, ప్లీడజ్వరం వంటి చర్మ వ్యాధులను మరియు ఇతర అంటు వ్యాధులను వ్యాపింపజేసే కీటకములుగా గుర్తించునట్లు ఈ వాక్యము దారితీసింది.[11]

## ఈగలు తొలగించబడుట (8:25-32)

**[25]అప్పుడు ఫరో మోషే అహరోనులను పిలిపించి - మీరు వెళ్లి ఈ దేశములో మీ దేవునికి బలి అర్పించుడని వారితో చెప్పగా [26]మోషే - అట్లు చేయతగదు; మా దేవుడైన యెహోవాకు మేము అర్పించవలసిన బలి ఐగుప్తీయులకు హేయము. ఇదిగో మేము ఐగుప్తీయులకు హేయమైన బలిని వారి కన్నుల యెదుట అర్పించిన యెడల వారు మమ్ము రాళ్లతో కొట్టి చంపుదురు గదా. [27]మేము అరణ్యములోనికి మూడు దినముల ప్రయాణమంత దూరముపోయి మా దేవుడైన యెహోవా మాకు సెలవిచ్చినట్లు ఆయనకు బలి నర్పించుదుమనెను. [28]అందుకు ఫరో - మీరు అరణ్యములో మీదేవుడైన యెహోవాకు బలి నర్పించుటకు మిమ్మును పోనిచ్చెదను గాని దూరము పోవద్దు; మరియునాకొరకు వేడుకొనుడనెను. [29]అందుకు మోషే - నేను నీ యొద్దనుండి వెళ్లి రేపు ఈ యీగల గుంపులు ఫరో యొద్దనుండియు అతని సేవకుల యొద్ద నుండియు అతని జనుల యొద్దనుండియు తొలగి పోవునట్లు యెహోవాను వేడుకొందును గాని, యెహోవాకు బలి అర్పించుటకు ఫరో జనులను పోనియ్యక ఇకను వంచనచేయకూడాదని చెప్పి. [30]ఫరో యొద్దనుండి బయలువెళ్లి యెహోవాను వేడుకొనెను. [31]యెహోవా మోషే మాట చొప్పున చేయగా ఈగల గుంపులు ఫరో యొద్దనుండియు అతని సేవకుల యొద్దనుండియు అతని ప్రజల యొద్దనుండియు తొలగిపోయెను; ఒక్కటియైనను నిలువలెదు. [32]అయితే ఫరో ఆ సమయమున కూడా తన హృదయమును కఠినపరచుకొని జనులను పోనియ్యడాయెను.**

**వచనము 25.** ఈ ఈగల గుంపు ఫరోను ఎంతగా బాధించాయి అంటే, మొట్టమొదటి సారి ఫరో మోషే యొక్క షరతులకు ఒప్పుకున్నాడు. ఆయన **మోషే మరియు అహరోనులను** పిలిపించి ఐగుప్తు **దేశములో**నే ఒక మత సంబంధమైన సెలవును తీసుకొనుటకు అనుమతించాడు. ఫరో ప్రతిపాదించిన రాజీల పరంపరలో ఇదే మొట్టమొదటి రాజీ ప్రయత్నం.

**వచనములు 26, 27.** మోషే బదులిస్తూ **ఐగుప్తీయులకు హేయము**గా ఉన్న ఆ దేశములో **దేవుడైన యెహోవాకు బలిని** అర్పించలేరని అన్నాడు (ఆది. 43:32; 46:34 చూడండి). "ఐగుప్తులో బలి ఇవ్వడం అంటే ముస్లింల మసీదులో ఒక పందిని చంపడం, లేదా ఒక హైందవ గుడిలో గోవును వధించడం లాంటిది గనుక మోషే అక్కడ బలినర్పించుటకు నిరాకరించాడు . . . ఒక్కసారిగా కల్లోలములు చెలరేగుతాయి" అని Cole అనే రచయిత వ్యాఖ్యానించాడు.[12] ఇక్కడ పేర్కొనబడిన మూడు కారణములలో ఏదైనా ఒక కారణముచేత ఐగుప్తీయులు ఇశ్రాయేలీయుల యొక్క బలి విధానానికి

అభ్యంతరం తెలిపి ఉంటారని James K. Hoffmeier సూచించాడు: (1) పశువులను వధించుటకు వారు అభ్యంతరపరచారు ఎందుకంటే వారు వాటిని పవిత్రమైనవిగా ఎంచారు; (2) గొర్రెల కాపరులను చూస్తే వారికి వైముఖ్యం గనుక గొర్రెను బలివ్వడానికి వారు అభ్యంతరపరచారు (ఆది. 46:34); లేదా (3) ఇశ్రాయేలు యొక్క బలి ఆచారములనువారు మిగుల అభ్యంతరపరచారు.[13] ఈ అభ్యంతరమునకు కారణమేమైనప్పటికీ, "యెహోవాకు పరిశుద్ధమైన అర్పణలను అన్యుల దేశములో అర్పించడం తగనిది"[14] అని మోషే యొక్క నిరసన సూచిస్తుంది. కాబట్టి ఇశ్రాయేలు **అరణ్యములోనికి మూడు దినముల ప్రయాణమంత దూరముపోయి** యెహోవాకు బలులను అర్పించాలని మోషే పట్టుబట్టాడు.

**వచనములు 28, 29.** మోషే యొక్క నిబంధనలకు **ఫరో** ఒప్పుకున్నట్లుగానే కనబడుతున్నాడు, కేవలం ఇశ్రాయేలు **దూరముపోవద్దు** అని మాత్రం చెప్పాడు. అప్పుడు ఫరో ఆ **ఈగల**ను తొలగించునట్లు **యెహోవా**ను వేడుకొనవలసినదిగా మోషేను కోరాడు. ఈ విషయాన్ని మరుసటి దినమందు ఆలోచిస్తాను అని చెప్పి మోషే ఒప్పుకున్నాడు; కాని **ఫరో** మరొకసారి ఇశ్రాయేలీయులతో, కప్పలు వచ్చినప్పుడు చేసినట్లుగా, **ఇకను వంచనచేయకూడదు** అని చెప్పాడు (8:8, 15). ఇతర మాటలలో, ఆ తెగులు తొలగింపబడిన తరువాత ఆయన ఇచ్చిన మాటలలో భాగాన్ని ఖచ్చితంగా నిలబెట్టుకోవాలని చెప్పాడు.

దేవునికి **బలి అర్పించుటకు**గాను అరణ్యములోనికి వెళ్లవలసినదే అని మోషే ఫరోతో చెప్పినప్పుడు ఆయన వాస్తవము చెప్తున్నాడా? ఈ ప్రశ్నకు ఒక సమాధానం, నిజానికి ఇశ్రాయేలు అరణ్యములో మూడు దినముల (అంతకంటే ఎక్కువనే) దూరం వెళ్లారు, మరియు వారు యెహోవాకు బలి అర్పించారు. మోషే చెప్పినది పరిపూర్ణమైన సత్యము కాకపోయినప్పటికీ, ఆయన వాస్తవమే చెప్పాడు అని కొందరు అనవచ్చు. ఉత్తమమైన జవాబు ఏమంటే అట్టి భాగ్యాన్ని ఫరో ఇశ్రాయేలుకు ఇచ్చినట్లయితే, నిర్గమము అవసరపడేదే కాదు. కాని, ఆ రాజు అనుమతించడని దేవునికి తెలుసు. కాబట్టి, విన్నపము కేవలం ఒక అడుగే, ఈ అడుగు ఇతర అడుగులతో కలిపితే ఐగుప్తుపై దేవుని యొక్క పరిపూర్ణ జయానికి మరియు ఇశ్రాయేలు యొక్క అద్భుతమైన విడుదలకు దారితీసింది.

**వచనములు 30-32.** ఈ సందర్భంలో ఫరో ముందు మోషే ప్రత్యక్షమవ్వడం యొక్క ఫలితం కప్పలను గూర్చిన తెగులు తరువాత జరిగిన దానిని పోలినదిగానే ఉంది (8:12-15). **మోషే** ప్రార్థించాడు, **యెహోవా** విన్నాడు, మరియు ఆ తెగులు **తొలగింపబడింది.** కాగా, **ఫరో తన హృదయమును కఠినపరచుకున్నాడు** మరియు ఐగుప్తు దేశమును విడచుటకు ఇశ్రాయేలీయులను అనుమతించలేదు. రాజు చాలా అహంకారిగా, క్రూరంగా, స్వార్థంగా, మరియు మోసపూరితంగా ఉన్నాడు. ఆయన నిబంధనను ఉల్లంఘించినవాడు. అట్టి నాయకుని పట్ల, ఎవరూ దయ చూపలేరు - కేవలం ఏహ్య భావమే. ఫరో యొక్క అంతిమ ఓటమి తట్టు చూడవలసినదిగా ఈ కథనము చదువరిని పురికొల్పుతుంది.

## అన్వయము

### “నా జనులను పోనిమ్ము” (8:1)

దేవుని ప్రజలు బానిసత్వములో ఉన్నారు, మరియు దేవుడు తన పక్షమున మాట్లాడువాడనైన మోషే ద్వారా “నా ప్రజలను పోనిమ్ము” (8:1) అని చెప్పాడు. నేడు, అనేకమంది బానిసత్వములో ఉన్నారు. వారు, ఉదాహరణకు, దారిద్ర్యము యొక్క ప్రభావముల ద్వారా, మద్యపానము ద్వారా, మాదక ద్రవ్యాలకు బానిసలుగుట ద్వారా, లేదా జాతి వివక్షల ద్వారా బానిసత్వములో ఉంటున్నారు. అట్టి ప్రజలు విడిపింపబడాలి! ఇంకా, వారు విడిపింపబడాలని దేవుడు ఆశిస్తున్నాడు.

ఈ లోకములో ఆయన కార్యము చేయుట కొరకైన దేవుని ప్రతినిధులము మనము. తమ జీవితములను భ్రష్టు పట్టిస్తున్న బానిసత్వము నుండిప్రజలను విడిపించడం అనేది సంఘము యొక్క ప్రధాన పని కాకపోయినప్పటికీ, ఇది కూడా మన కార్యక్రమాల్లో భాగముగా ఉండాలి. ఇతరులకు భౌతికముగా, సామాజికముగా, మరియు మానసికంగా సహాయపడడం అనేది మనకు అవకాశము దొరికినప్పుడల్లా ప్రజలందరికి మంచి చేయడమే అవుతుంది (గలతీ. 6:10). అనాథలను దర్శించడం (యాకోబు 1:27), ఇతరులు మనకు ఏమి చేయాలి అనుకుంటామో మనము కూడా వారికి అలాగే చేయడం (మత్తయి 7:12), మరియు మనవలె మన పొరుగువారిని ప్రేమించడం (మత్తయి 22:39), ఇవన్నియు ఇందులో భాగాలే.

కాగా, అతి ప్రాముఖ్యమైనది ఏమంటే ప్రజలు పాపమునకు బానిసలుగా ఉన్నారు మరియు విడిపింపబడవలసిన అవసరతలో ఉన్నారు అని గ్రహించడం (రోమా. 3:23; 6:23). క్రీస్తు నామములో పాపమునకు మరియు సాతానుకు బానిసలుగా ఉన్నవారిని విడిపించడానికి మనము చేయవలసినదల్లా చేయడమే సంఘము యొక్క ప్రధానమైన కార్యముగా ఉంది (యోహా. 8:34-36; హెబ్రీ. 2:14, 15). ఇశ్రాయేలు యొక్క విడుదల కొరకు మోషే ఫరోతో పోరాడినట్లుగానే, అపవాది యొక్క బంధకములో నుండి ప్రజలను విడిపించే ప్రయత్నంలో, దేవుని నామములో “నా జనులను పోనిమ్ము” అని గట్టిగా పలుకుట ద్వారా మనము నిరంతర పోరాటములో ఉన్నాము.

### సమము కాని దేవుడు (8:10)

8:10ను ఒక మూలముగా చేసుకొని అనేకమైన పాఠములను వృద్ధిచేయవచ్చు.

1. ఈ తెగుళ్లు సారాంశంలో ఏమి తెల్పినవి అంటే ఐగుప్తులోని దేవుళ్లు దేవుడైన యెహోవాతో పోల్చుటకు చాలినవారు కారు. ఇదే సత్యాన్ని ప్రవక్తలు తరచూ బోధించారు, ప్రజల విగ్రహములతో యెహోవాను ప్రత్యేకంగా చూపారు. “యెహోవాను పోలినవారు ఎవరును లేరు” అనే విషయాన్ని మనం అర్థంచేసుకోవాలి.

2. నేటికాలంలో మన అడుగులను నిర్దేశించుటకు, మన జీవితములను ఆశీర్వదించుటకు, మరియు పాపమునుండి మనలను విడిపించుటకు “యెహోవాను

పోలినవారు ఎవరును లేరు."

3. మరొక సాధ్యపడు విషయమేమనగా దేవుని యొక్క లక్షణములపై దృష్టి నిలపడం: "యెహోవాను పోలినవారు ఎవరును లేరు," ఉదాహరణకు, పరిశుద్ధతలో, ప్రేమలో, లేదా ఉగ్రతలో.

## దేవుడు ప్రార్థనలకు జవాబు ఇస్తాడు (8:12, 13)

"మోషే యెహోవాకు మొఱ్ఱ పెట్టెను," మరియు "యెహోవా మోషే మాట చొప్పున చేసెను" (8:12, 13). నీతిమంతులు దేవునికి మొఱ్ఱ పెట్టినప్పుడు, దేవుడు వారిని వింటాడు (మత్తయి 7:7, 8; యాకోబు 5:16).

## అత్యంత ప్రమాదకరమైన వ్యాధి: హృదయమును కఠినపరచుకోవడం (8:15)

"ధమనులను కఠినపరచుకొనుట" అనే భయంకరమైన పరిస్థితితో కొంత మంది బాధపడుతుంటారు. ఈ స్థితికి వైద్యపరమైన పదము "arteriosclerosis," మరియు దీనిని "ధమనుల గోడలు మందబడి గట్టి పడడం వలన రక్తప్రసవమును కఠినపరచే ఒక దీర్ఘకాలిక వ్యాధి"[15] అని నిర్వచించవచ్చు. ఈ వ్యాధి ఉన్న వ్యక్తి పోటుకు లేదా గుండెపోటుకు గురయ్యే ప్రమాదంలో ఉంటాడు.

దీనికంటే మరింత ఘోరమైన వ్యాధి "హృదయమును కఠినపరచుకోవడం." ఫరోకు ఈ సమస్య ఉండినది. ఫరో "తన హృదయమును కఠినపరచుకొని" దేవుని బిడ్డల "మాటను వినకపోయెను" అని నిర్గమ. 8:15 సెలవిస్తుంది. దేవుడు మోషే చెప్పినట్లుగా కేవలం కప్పల ద్వారా రెండవ తెగులును మాత్రమే ఐగుప్తు దేశము మీదికి పంపాడు. ఫరో మనస్సు మార్చుకొని ఇశ్రాయేలును పోనిస్తానని చెప్పి ఆ కప్పలను తొలగించమని మోషేను కోరాడు (8:8). మోషే ఒప్పుకున్నాడు, ఫరో ఒక సమయం చెప్పాడు, మరియు కప్పలన్నీ చచ్చినవి. కాని, ఫరో తన మాటను గౌరవించలేదు; జనులను పోనిచ్చుటకు నిరాకరించాడు. ఆయన "తన హృదయమును కఠినపరచుకున్నాడు."

ఫరో యొక్క హృదయ కాఠిన్యమును గూర్చి మనము ఆలోచిస్తుండగా, ఇదే విధమైన సమస్య ద్వారా నేటి ప్రజలు ఎలా బాధింపబడగలరో కూడా మనం గమనించగలం.

*ఫరో యొక్క హృదయము ఎలా కఠినపరచబడింది?* ఫరో తన హృదయమును కఠినపరచుకున్నాడని నిర్గమకాండము కొన్నిసార్లు చెప్తుంది (8:15), కాగా మరికొన్ని సార్లు దేవుడు ఆయన హృదయమును కఠినపరచాడు అని చెప్తుంది (4:21; 7:3; 9:12; 10:1). ఏది వాస్తవము? దేవుడు ఫరో హృదయమును కఠినపరచాడని మనము అన్నట్లయితే, ఫరోకు స్వయంచిత్తం అనేది లేదు, దేవుడు ఆయనపై బలవంతంగా పెట్టిన కార్యమును చేయకుండా ఉండుటకు ఆయనకు ఎటువంటి అవకాశం లేదు అని దీని అర్థమా?

ఈ సమస్యకు ఉత్తమమైన పరిష్కారం ఏమంటే ఫరో తన హృదయమును కఠినపరచుకున్నాడు అని నిర్గమకాండము మొదటిగా ఉద్ఘాటిస్తుంది మరియు ఆ

తరువాతనే దేవుడు ఫరో హృదయమును కఠినపరచాడని తెలుపుతుంది. 4:21 మరియు 7:3 రెండు కూడా దేవుడు భవిష్యత్తులో ఏమి చేయనైయున్నాడో అనే దానిని గూర్చి మాట్లాడుతున్నాయి; ఫరో తన హృదయమును కఠినపరచుకొనిన తరువాతనే దేవుడు తన హృదయమును కఠినపరచాడని వాక్యము చెప్తుంది. వేరొక విధంగా చెప్పాలంటే, ఫరో తన హృదయమును కఠినపరచుకొనిన తరువాత, దేవుడు దానిని ఇంకా కఠినపరచాడు. తాను అనుసరించవలసిన మార్గమును గూర్చి ఫరో ముందుగానే నిర్ణయించుకున్నాడు, కాని దేవుడు ఆ మార్గములో వెళ్లుటకు బహుశా కొంత ఊతను ఇచ్చినట్లుగా ఉన్నాడు. మనకు వలెనె ఫరోకు స్వయంచిత్తము ఉంది అనే విషయంపై మనం ఖచ్చితంగా ఉండవచ్చు. తన నిర్ణయాలకు ఆయనే బాధ్యుడు, మరియు ఆయన తీసుకున్న నిర్ణయాలను బట్టి దేవుడు ఆయనను ఉత్తరవాదిగా చేస్తాడు.

ఫరో తన హృదయమును కఠినపరచుకున్నప్పుడు ఏమి జరిగిందో అనే విషయాన్ని మనము ఇంకా జాగ్రత్తగా పరిశీలించినప్పుడు, ఫరో యొక్క ఈ వ్యాధికి ఈ క్రింది లక్షణాలు ఉన్నట్లుగా మనం చూడగలం: (1) పట్టుదల మరియు మొండితనం, (2) దేవుని వాక్యమును వినుటకు నిరాకరణ, (3) ఆ వాక్యమును గూర్చిన విస్తారమైన సాక్ష్యమును అంగీకరించుటకు విముఖునిగా ఉండడం, (4) అహంకారం మరియు గర్వం, మరియి (5) ప్రజల పట్ల దయాగుణ లోపం.

*మన హృదయములు ఎలా కఠినపడగలవు?* "హృదయమును కఠినపరచుకొనుట" అనేది ఈనాటి సమస్య కూడా. కొంతమంది తమ మనసాక్షుల విషయంలో "వాతపేయబడినవారు"గా ఉన్నారు అని క్రొత్తనిబంధన చెప్తుంది (1 తిమోతి 4:2; KJV). దీనికి తోడు, తమ హృదయములను కఠినపరచుకొనిన వారిని గూర్చి కూడా అది మాట్లాడుతూ (మార్కు 6:52; అపొ. 19:9) హృదయమును కఠినపరచుకొనుటను గూర్చి మనలను హెచ్చరిస్తుంది (హెబ్రీ. 3:8, 13, 15; 4:7).

"అబద్ధమును నమ్మునట్లు మోసముచేయు శక్తిని దేవుడు వారికి పంపుచున్నాడు" గనుక కొందరు "నశింతురు" అని రెండవ థెస్సలొనీకయులకు 2:10-12 వచనములు తెలుపుతున్నాయి. స్వయంగా దేవుని ద్వారానే నాశన మార్గమునకు నడిపింపబడుతున్న ఈ ప్రజలు ఎవరు? "రక్షింపబడు నిమిత్తము సత్యము పట్ల ప్రేమకలిగి ఉండక" మరియు "సత్యమును నమ్మక దుర్నీతి యందు అభిలాష" కలిగిన వారు ఈ ప్రజలు. మరొక విధంగా చెప్పాలంటే, ఒక వ్యక్తి సత్యమును ప్రేమింపక లేక నమ్మకయుండి దుర్నీతిలో ఆనందమును పొందుతున్నవాడయితే, అప్పుడు అతడు అబద్ధమును నమ్మి శాశ్వతంగా నాశనమగునట్లు దేవుడు వారిపై "మోసము చేయు శక్తి"ని పంపగలడు! ఫరో వలె మనము కూడా తప్పుడు మార్గమును ఎన్నుకొంటే, దానిని తీసుకొనుటలో దేవుడు మనలను ఏమాత్రము అడ్డగించడు. నిజానికి, ఆ మార్గములో మనలను త్వరపెట్టవచ్చు.

దేవుని వాక్యమునకు విస్తారమైన ఆధారము ఉన్నప్పటికీ కూడా ఒకవేళ మనము దేవుని వాక్యమును వినుటకు విముఖత చూపుతూనేఉంటే, అప్పుడు మనము మన హృదయమును కఠినపరచుకొనినవారము అవుతాము. మనము గర్వముతో నిండియుండి ఇతరుల పట్ల జాలి లేనట్లయితే, అప్పుడు మనము ఫరోలాగానే

ఉంటున్నాము.

*ముగింపు.* హృదయము కఠినపరచుకోవడం అనేది ధమనులు కఠినపడడం కంటే అత్యంత ప్రమాదకరమైనది అని మనం జ్ఞాపకముంచుకోవాలి ఎందుకంటే అది శాశ్వత మరణమునకు నడిపించగలదు! దేవుని వాక్యము హృదయమును మృదువుపరచగలదు. శిలువను గూర్చిన కథనము మరియు మనకొరకు మరణించిన క్రీస్తు మనకును దేవుని కరుణకును మధ్య మనము నిర్మించుకొన్న ఆ గోడను పడగొట్టగలదు. విశ్వాసముతోమరియు విధేయతతో మనము ఆయన యొద్దకు వచ్చుదము.

### "ఇది దైవశక్తి" (8:19)

"ఇది దైవశక్తి" వలన కలిగినది అని ఐగుప్తీయుల శకునగాండ్రు చెప్పినప్పుడు (8:19), వారు ఆ పేల వలన కలిగిన తెగులునకు కారణము ఇశ్రాయేలు దేవుడే అని గుర్తించారు. మనము కొన్నిసార్లు ప్రకృతి వైపరీత్యాలను "దైవకార్యములు"గా పరిగణిస్తాము, కాని మనము అనుభవిస్తున్న ఇతర కార్యాలు కూడా "దైవకార్యములు" కావా? మన జీవితములలో "దైవశక్తి"ని చూస్తున్నామా? మన ప్రపంచంలో దేవుడు క్రియ చేస్తున్నాడు అని మనం గుర్తించాలి. దేవుడు మన జీవితములలో కార్యములు చేస్తుండగా "దైవశక్తి"ని చూచుటకు మనము నేర్చుకోవాలి.

---

సూచనలు

[1]David M. Howard, Jr., "Oven," in *The International Standard Bible Encyclopedia*, rev. ed., ed. Geoffrey W. Bromiley (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1986), 3:622. [2]Adrianus van Selms, "Bread," in *The International Standard Bible Encyclopedia*, rev. ed., ed. Geoffrey W. Bromiley (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1979), 1:541. [3]Ibid. [4]దేవుని నిర్దేశములకు మోషే చూపిన విధేయతను వివరించుటకు ప్రయోగించిన అదే పదాలను మోషే ప్రార్థనకు దేవుడు ఇచ్చిన జవాబును గూర్చి కూడాప్రయోగించారు (7:6, 10, 20). [5]Walter C. Kaiser, Jr., "Exodus," in *The Expositor's Bible Commentary*, vol. 2, *Genesis-Numbers* (Grand Rapids, Mich.: Zondervan, 1990), 352. Verse 15 is numbered as verse 11 in the Hebrew text. [6]ఈ నివేదిక ఒక ప్రత్యక్షసాక్షి ద్వారా లిఖించబడింది కాబట్టి దాని ఖచ్చితత్వమునకు ఆధారమును ఇస్తుంది అని ఈ వివరణలు మనకు సూచిస్తున్నాయి. [7]నిర్గమకాండము 8:16-18తో పాటుగా, *ken* అనే పదం కీర్త. 105:31లో మూడవ తెగులును గూర్చి మాట్లాడుతున్న సందర్భంలో కనబడుతుంది. ఇంకాచూస్తే, ఈ పదము యెషయా 51:6లో కూడా ఉన్నదని కొంతమంది పండితులు అభిప్రాయం; NIV అనువాదం ఆ వాక్యభాగంలో "ఈగలు" అని అనువదిస్తుంది. [8]Philo *On the Life of Moses* 1.19. [9]R. Alan Cole, *Exodus: An Introduction and Commentary*, Tyndale Old Testament Commentaries (Downers Grove, Ill.: Inter-Varsity Press, 1973), 92-93. [10]Cole, 93-94. See Philo *On the Life of Moses* 1.23.

[11]John H. Walton and Victor H. Matthews, *Genesis-Deuteronomy*, The IVP Bible Background Commentary (Downers Grove, Ill.: InterVarsity Press, 1997), 92. [12]Cole, 95. [13]James K. Hoffmeier, “Exodus,” in *Evangelical Commentary on the Bible*, ed. Walter A. Elwell (Grand Rapids, Mich.: Baker Book House, 1989), 46. [14]Ibid. [15]*The American Heritage Dictionary*, 4th ed., s.v. “arteriosclerosis.”